లక్షెట్టిపేట : మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలోని డైనింగ్ హాల్‌లో నిద్రిస్తున్న శునకం

లక్షెట్టిపేట బాలికల గురుకుల పాఠశాలలో పని చేయని మినరల్ వాటర్ ప్లాంట్



లక్షెట్టిపేట ఎంజేపీలో ఏర్పాటు చేసిన మెనూ

శిథిలావస్థలో ఉన్న కాగజ్‌నగర్ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల

కాగజ్‌నగర్ : డైనింగ్ టేబుల్ లేక కింద కూర్చొని భోజనం తింటున్న విద్యార్థులు

దహెగాం : కస్తూర్బా గురుకుల విద్యాలయం వంటశాల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

కాగజ్‌నగర్ : కిటికీలకు డోర్‌లు లేకపోవడంతో కట్టిన సంచులు

బెల్లంపల్లి : గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి చెట్ల మధ్య కూర్చున్న తల్లిదండ్రులు

తాండూర్ మండల కేంద్రంలో అద్దె భవనంలో కొనసాగుతున్న మహాత్మా జ్యోతి బాపులే గురుకుల పాఠశాల (ప్రహరీ లేదు)

సమస్యల వలయంలో గురుకులం

అద్దె, శిథిల భవనాల్లో కొనసాగుతున్న విద్యాలయాలు

- అరకొర వసతుల నడుమ విద్యార్థుల పాట్లు
- సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక అవస్థలు
- డైనింగ్ హాల్ లేక ఆరుబయట కూర్చొని భోజనం
- మెనూ పాటించని కాంట్రాక్టర్లు
- అర్ధాకలితో అలమటిస్తున్న పిల్లలు
- కరెంట్ పోతే కటిక చీకట్లో భయంభయం
- 'నమస్తే తెలంగాణ' విజిట్‌లో వెలుగు చూసిన నిజాలు

మంచిర్యాల, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గురుకులాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అద్దె, శిథిలమైన భవనాల్లో అరకొర వసతుల నడుమ కొనసాగుతుండగా, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టకపోవడంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటించాల్సి వస్తున్నది. అనేకచోట్ల పిల్లల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇక కరెంట్ పోతే కటిక చీకట్లో భయం భయంగా గడపాల్సి వస్తున్నది. రాత్రి సమయంలో విష పురుగులు సంచరిస్తుండడంతో బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. శనివారం 'నమస్తే తెలంగాణ' గురుకులాలను విజిట్ చేయగా, అనేక సమస్యలు వెలుగుచూశాయి.

మంచిర్యాల జిల్లాలో..

- తాండూర్ మండలంలోని జ్యోతిబాపులే పాఠశాల అద్దె భవనంలో 421 మంది విద్యార్థులతో కొనసాగుతున్నది. కనీస సౌకర్యాలు లేని కారణంగా తాండూరుకు మంజూరైన ఇంటర్ కళాశాలను చెన్నూర్‌కు తరలించారు. ● చెన్నూర్‌లో గురుకుల సంక్షేమ పాఠశాలలో డైనింగ్ హాల్ లేక విద్యార్థులు ఆరుబయట కింద కూర్చొని భోజనం చేస్తున్నారు. ● లక్షెట్టిపేట బాలికల గురుకులంలో మినరల్ వాటర్ ప్లాంట్ పని చేయకపోవడంతో విద్యార్థులకు శుద్ధజలం అందడం లేదు. లక్షెట్టిపేట మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. శనివారం భోజనంలో గుడ్డు పెట్టలేదు. ● బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం వడ్డించాల్సి ఉండగా, శనివారం ఉదయం అన్నం, కారంతో భోజనం పెట్టారు.
- బెల్లంపల్లి జ్యోతిబాపూలే బాలికల గురుకుల విద్యాలయంలో 550 మంది విద్యార్థులుండగా, 10 మరుగుదొడ్లు మాత్రమే ఉండడంతో విద్యార్థులు పాట్లు పడుతున్నారు. అద్దెభవనంలో అరకొర వసతుల మధ్య చదువులు కొనసాగించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రాత్రి సమయంలో విష పురుగులతో ప్రమాదం పొంచి ఉందని పిల్లలు చెబుతున్నారు.

ఆసిఫాబాద్ జిల్లాలో..

కాగజ్‌నగర్, ఆగస్టు 10 : కాగజ్‌నగర్ పట్టణంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 30 ఏళ్ల క్రితం నిర్మించగా, ఎప్పుడు ఏం జరుగుతుందోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సరైన సౌకర్యాలు లేక తిప్పలు పడుతున్నారు. కిటికీలకు తలుపులు లేకపోవడంతో.. వాటికి ప్లాస్టిక్ సంచులు కట్టారు. వర్షం వచ్చినప్పుడు గదుల్లోకి నీరు చేరుతున్నది. పూర్తి స్థాయి డైనింగ్ టేబుళ్లు లేకపోవడంతో విద్యార్థులు కింద కూర్చొని భోజనం చేయాల్సి వస్తున్నది. నెలల తరబడి బిల్లులు రావడం లేదనే సాకుతో కాంట్రాక్టర్లు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదు.

సిర్పూర్(టీ), ఆగస్టు 10 : సిర్పూర్(టీ) మండలకేంద్రంలో మూడు గురుకులాలు (సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల, గురుకుల బాలుర పాఠశాల/కళాశాల, కాగజ్‌నగర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల) ఉన్నాయి. కాగజ్‌నగర్ గురుకుల బాలికల పాఠశాలలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. సిర్పూర్(టీ) బాలుర గురుకుల భవనం 30 ఏళ్ల క్రితం నిర్మించగా, శిథిలమయ్యింది. డైనింగ్‌హాల్ శిథిలావస్థలో ఉంది. మరమ్మతులు చేపట్టాలి. దహెగాం, ఆగస్టు 10 : మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల విద్యాలయం ఆవరణ పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా మారింది. పొదల నుంచి విష పురుగులు వచ్చే అవకాశముండడంతో విద్యార్థులు భయపడుతున్నారు. వంటశాల గది కిటికీలు పగిలిపోయి శిథిలావస్థలో ఉంది. రెబ్బెన మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో వాచ్‌మెన్ పోస్టు, గంగాపూర్‌శివారులోని కేజీబీవీ మూడు పోస్టులు, గోలేటి ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలో ఎస్టీజీ పోస్ట్ ఖాళీగా ఉంది.

చెన్నూర్ : డైనింగ్ హాల్ లేక ఆరు బయట భోజనం చేస్తున్న గిరిజన సంక్షేమ గురుకుల విద్యార్థులు

కుక్కలు వస్తున్నయి

లక్షెట్టిపేట,ఆగస్టు 10 : పాఠశాల ఆవరణలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. పాఠశాల నుంచి డైనింగ్ వరకు ఒంటరిగా నడిచి వెళ్లాలంటే భయమేస్తుంది. అన్నం తినే డైనింగ్‌లోకి కూడా శునకాలు వస్తున్నాయి.

- అరవింద్, మహాత్మా జ్యోతిబాపూలే విద్యార్థి, లక్షెట్టిపేట

కోడిగుడ్లు పెట్టలేదు

లక్షెట్టిపేట,ఆగస్టు 10 : మా క్యాంపస్‌కు కాంట్రాక్టర్ కోడిగుడ్లు పంపించ లేదు. అందుకే విద్యార్థులకు కోడిగుడ్లు పెట్టలేదు. మెనూపై అన్నీ రాసి ఉంటాయి. అలా పెట్టడం కుదురుతుందా..

- జీ.స్వప్న, మహాత్మాజ్యోతిబాపూలే డిప్యూటీ వార్డెన్, లక్షెట్టిపేట

తొందరలోనే వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేపిస్తాం

లక్షెట్టిపేట,ఆగస్టు 10 : వంట గదిలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ పాడైపోయినట్లు సిబ్బంది తెలిపారు. నేను ఇక్కడికి వచ్చి వారమే అవుతుంది. క్యాంపస్‌లో మరో రెండు ఆర్వో వాటర్ ప్లాంట్స్ ఉన్నాయి. కిచెన్‌కు నీరు పంపించి వంట చేపిస్తున్నాం. గతంలో ఉన్న ప్రిన్సిపాల్ ఆర్వో ప్లాంట్ మరమ్మతు కోసం నివేదిక పంపించినట్లు తెలిసింది. త్వరలో ఆర్వో ప్లాంట్ తెప్పించి కిచెన్‌లో ఏర్పాటు చేస్తాం. బిల్డింగ్‌కు కూడా రంగులు వేయించాలని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తా.

- రమాకళ్యాణి, ప్రిన్సిపాల్, లక్షెట్టిపేట బాలికల గురుకులం

విజేతగా పీపీ సురేంద్ర ఉపాధ్యాయ టీం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 10 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ ఉషోదయ పాఠశాలలో శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. నాలుగు టీంలు తలపడగా, పీపీ సురేంద్ర ఉపాధ్యాయ టీం, జ్యుడీషియల్ స్టాఫ్ టీం ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్లో పీపీ సురేంద్ర ఉపాధ్యాయ టీం విజయం సాధించగా, జ్యుడీషియల్ స్టాఫ్ టీం రన్నర్‌గా నిలిచింది. అద్భుతమైన ప్రదర్శనతో మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా రవితేజ నిలిచారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కట్కూరి గంగయ్య, జనరల్ సెక్రటరీ మురళీకృష్ణ, స్పోర్ట్స్ సెక్రటరీ సంతోష్, సీనియర్ న్యాయవాదులు వడ్నాల సత్యనారయణ, ఎం.రవీందర్, రంగు మల్లేశ్, మదన్‌మోహన్, అరుమంద రవి, ప్రకాశ్ పాల్గొన్నారు.

పోటీల్లో విజయం సాధించిన బృందం

ఐటీ పార్కు నిర్మాణం కోసం స్థల పరిశీలన

హాజీపూర్, ఆగస్టు 10 : మండలంలోని వేంపల్లి గ్రామ శివారులో ఐటీ పార్కు నిర్మించేందుకు కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం స్థలాన్ని పరిశీలించారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 159లోని భూమిని పరిశీలించారు. డిప్యూటీ తహశీల్దార్ హరితను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్‌ఐ మంగ, ప్రభుతో పాటు శ్రీలత ఉన్నారు.

ఆకస్మిక తనిఖీ

జన్నారం, ఆగస్టు 10 : రేండ్లగూడ, కిష్టాపూర్ గ్రామాన్ని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నర్సరీ, ప్లాంటేషన్, డంప్ యార్డు, శ్మశానవాటికను పరిశీలించారు. మొక్క నాటి నీరు పోశారు. డంప్ యార్డులో వర్మికంపోస్టును తయారు చేస్తున్నారా.. లేదా అడిగి తెలుసుకున్నారు. ప్లాంటేషన్ సక్రమంగా నిర్వహిస్తున్నందుకు పంచాయతీ కార్యదర్శి ఎల్ శ్రీనివాస్‌ను అభినందించారు. ఎంపీడీవో శశికళ, ఎంపీవో జలెందర్, స్పెషల్ ఆఫీసర్ శ్రీకాంత్, కార్యదర్శులు ఎల్ శ్రీనివాస్, విశ్వశ్రీ, మాజీ సర్పంచ్ ఆశారాజ్, ఏపీవో రవీందర్, ఎంపీఎం బుచ్చన్న, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీ పార్క్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

పులి జాడ కోసం వాగుదాటి వెళ్తున్న అటవీశాఖ అధికారులు

పులి కోసం నిఘా

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అధికారులు

కెరమెరి, ఆగస్టు 10 : జిల్లాలో పులి సంచరిస్తున్న నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. కాగజ్‌నగర్ డివిజన్‌తో పాటు ఆసిఫాబాద్, తిర్యాణి మండలాల్లో దాని కోసం అన్వేషిస్తున్నారు. ఇటీవల అనార్‌పల్లి అడవుల్లో పులి ఓ మేకను చంపగా, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అడవుల్లో ఉన్నది పులినా.. లేకా చిరుతనా అని తేల్చేందుకు అటవీ శాఖ అధికారులు రంగంలో దిగారు. శనివారం కెరమెరి ఎఫ్ ఆర్వో సయ్యద్ మజారొద్దీన్ ఆధ్వర్యంలో సిబ్బంది పులి అడుగు జాడలు కనుకునేందుకు అనార్‌పల్లి వాగు దాటి దేవాపూర్ బీట్ పరిధిలోని అడవుల్లో వెతికారు. ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదు. అనార్‌పల్లితో పాటు కరంజీవాడ, బోరిలాల్‌గూడ అడవుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అధికారులు

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679